సాక్షి
వికారాబాద్
గురువారం । 22 । ఫిబ్రవరి । 2024



హామీలన్నీ నెరవేరుస్తాం

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ కచ్చితంగా అమలు చేస్తామని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 8లో▸



అడవిలో దొంగలు పడ్డారు

ధారూరు అడవిలో దొంగలు పడ్డారు. ఇష్టను సారంగా చెట్లను నరుకుతూ అడవిని లూటీ చేస్తున్నారు. 8లో▸



లక్షలు పోశారు..

లక్షలు పోసి నిర్మించిన దుకాణ సముదాయం.. అధికారుల నిర్లక్ష్యంగా నిరుపయోగంగా మారింది. 9లో▸

మీ ఆశీర్వాదమే సీఎంను చేసింది

మీరు తలెత్తుకునేలా పని చేస్తా

- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి
- సీఎం హోదాలో తొలిసారి సొంత నియోజకవర్గంలో పర్యటన
- రూ.4,369 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కోస్గి సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్: కొడంగల్ ప్రజల ఆశీర్వాదమే తనను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చేసిందని రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని కోస్గి పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొడంగల్‌ను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయలేదన్నారు. కృష్ణా – వికారాబాద్ రైల్వే లైన్‌ను పక్కన పెట్టారని ఆరోపించారు. ఉమ్మడి పాలమూరు, వికారాబాద్ జిల్లాల్లోని జాతీయ రహదారుల నిర్మాణంలో నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ప్రాణ సమానులైన కార్యకర్తలకు, కొడంగల్ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. సీఎం హోదాలో తొలిసారి నియోజకవర్గానికి వస్తున్నందున ఈ ప్రాంత ప్రజలకు మేలు జరిగే విధంగా రూ.4,369 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్‌లోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.16 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మల్లు రవి, తిరుపతిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల వివరాలు..

- కోస్గి పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా మారుస్తూ జీఓ నంబరు – 1 విడుదల చేశారు. రూ.30 కోట్లు మంజూరు చేశారు. అందులో రూ.20 కోట్లతో భవనాలు, రూ.10 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నారు.
- కోస్గికి మహిళా డిగ్రీ కళాశాలను మంజూరు చేశారు. భవన నిర్మాణం, వసతుల కల్పనకు రూ.11 కోట్లు మంజూరు చేశారు.
- దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఏర్పాటుకు అనుమతులు. ఒక్కో కళాశాల భవన నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు రూ.7.13 కోట్ల చొప్పున రెండింటికి రూ.14.26 కోట్లు మంజూరు చేశారు.
- కొడంగల్‌కు ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంజూరు చేశారు. ప్రతి ఏడాది 50 సీట్లు చొప్పున భర్తీ చేస్తారు. భవన నిర్మాణాలు మౌలిక సదుపాయాల కోసం రూ.124.50 కోట్లు మంజూరు చేశారు.
- కొడంగల్‌కు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను మంజూరు చేశారు. ప్రతి ఏటా 60 సీట్లు భర్తీ చేయాలని నిర్ణయించారు. భవన నిర్మాణం, ఇతర అవసరాల కోసం రూ.46 కోట్లు మంజూరు చేశారు.
- కొడంగల్‌లో ప్రభుత్వ ఫిజియోథెరపీ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి ఏటా 50 సీట్లు భర్తీ చేస్తారు. అలాగే పారామెడికల్ కళాశాలకు అనుమతి ఇచ్చారు. ప్రతి ఏడాది 30 సీట్లు భర్తీ చేస్తారు. ఇందు కోసం రూ.27 కోట్లు మంజూరు చేశారు.
- కొడంగల్ ప్రభుత్వాస్పత్రిని విస్తరించి 220 పడకల సామర్థ్యంతో టీచింగ్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. దీనికి రూ.27 కోట్లు కేటాయించారు.
- కొడంగల్ – నారాయణపేట ఎత్తిపోతల పథకానికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. పథకం అమలు కోసం రూ.2,945 కోట్లు మంజూరు చేశారు. కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లో లక్షా 5వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.
- సాంఘిక సంక్షేమ శాఖ, మైనార్టీ వెల్ఫేర్ గురుకులాలకు అధునాతన వసతులతో భవనాలు నిర్మించనున్నారు. మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ శివారులో నిర్మాణాలు చేపట్టనున్నారు. మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల నూతన భవనానికి రూ.20 కోట్లు మంజూరు చేశారు. మున్సిపల్ పరిధిలోని సర్వే నంబరు 496లో 4 ఎకరాల స్థలాన్ని కేటాయించారు.
- కొడంగల్ పెద్ద చెరువు కట్టను అభివృద్ధి చేసి ట్యాంకు బండ్‌గా తీర్చిదిద్దడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.
- కొడంగల్ మున్సిపాలిటీని రూ.292 కోట్లతో అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మురుగు కాల్వల నిర్మాణం, తాగునీటి సరఫరా, సీవరేజ్ సిస్టం ఏర్పాటు, అంబేడ్కర్ చౌరస్తా విస్తరణ, మున్సిపల్ కార్యాలయానికి నూతన భవనం, క్రీడా ప్రాంగణం, ఇండోర్ స్టేడియం, స్పోర్ట్స్ కోచింగ్ సెంటర్, బండల ఎల్లమ్మ, వేంకటేశ్వర స్వామి ఆలయాల అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ సిస్టం తదితర పనులకు ప్రతిపాదనలు పంపారు.
- కొడంగల్‌లో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరయ్యాయి.
- నియోజకవర్గంలో రోడ్ల విస్తరణకు రూ.344 కోట్లు మంజూరు చేశారు.
- పాఠశాల భవనాల కోసం రూ.30 కోట్లు మంజూరయ్యాయి.

న్యూస్‌రీల్

ఎడ్యుకేషన్ హబ్‌కు స్థలాల పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీఎస్ శాంతికుమారి

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ సమీపంలో ఎడ్యుకేషన్ హబ్‌కు అవసరమైన స్థలాలను బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పరిశీలించారు. ప్రస్తుతం ఇక్కడ గిరిజన బాలుర గురుకుల పాఠశాల నడుస్తోంది. ఇదే ప్రాంతంలో మైనార్టీ గురుకుల పాఠశాల, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలకు నూతన భవనాలను నిర్మించనున్నారు. ఇందు కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో శాంతికుమారి గురుకుల పాఠశాలను సందర్శించి భవన నిర్మాణాలకు కేటాయించిన స్థలాలను, ఇందుకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తాండూరు ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ విజయకుమార్, డీటీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలోనే గట్టి పునాది పడాలి

డీఈఓ రేణుకాదేవి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రేణుకాదేవి

మోమిన్‌పేట: ప్రాథమిక దశలోనే విద్యార్థులకు గట్టి పునాది పడాలని డీఈఓ రేణుకాదేవి సూచించారు. బుధవారం మండలంలోని మల్లారెడ్డి గూడెం, అంరాధికలాన్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రాథమిక దశలోనే అన్ని సబ్జెక్టులపై ప్రావీణ్యం సంపాదించాలన్నారు. చదవడం, రాయడం, కూడికలు, తీసివేతలుల్లో ప్రావీణ్యం ఉంటేనే ఉన్నత విద్యలో రాణిస్తారని తెలిపారు. ఉపాధ్యాయులు ఆ దిశగా చొరవ చూపాలని ఆదేశించారు. అలాగే పరిసరాల పరిశుభ్రత ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి పిల్లల చదువుపై చర్చించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసు అభ్యర్థులకు శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న పోలీసు శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ మురళీధర్

అనంతగిరి: ఇటీవల కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు వికారాబాద్‌లోని పీటీసీలో శిక్షణ కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభమైంది. ఆసిఫాబాద్, సిద్దిపేట, రామగుండం జిల్లాల నుంచి ఏఆర్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన 224 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు పీటీసీ ప్రిన్సిపాల్ ఏఎస్పీ మురళీధర్ తెలిపారు. ఉదయం పోలీసు అభ్యర్థులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎస్పీ కోటిరెడ్డి సూచనల మేరకు అభ్యర్థులకు అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీసీ సీఐ వెంకటరమణ నాయక్ ఆర్‌ఎస్‌ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణే పంటలకు రక్ష

మొయినాబాద్ రూరల్: సరైన సస్యరక్షణ చర్యలతో పంటలను కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గీత రైతులకు సూచించారు. మండల పరిధిలోని నక్కలపల్లిలో కొనసాగుతున్న పీఎం కిసాన్ ఈకేవైసీ నమోదును పరిశీలించారు. అనంతరం తోలుకట్టలో రైతులు సాగు చేసిన పలు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణం వరిలో అగ్గితెగులు ఆశించేందుకు అనుకూలంగా ఉందన్నారు. దీని నివారణకు 0.6 ట్రైసైక్లోజర్, 1.5 మిల్లీలీటర్ మెసోప్రొడయోరిన్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాగమ్మ, ఏఈఓ కుమార్, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.



స్వప్నకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్ గూటికి స్వప్న పరిమళ్

సీఎం రేవంత్ సమక్షంలో చేరిన తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్

తాండూరు: తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు.. ఆ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు లేఖ పంపించారు. పార్టీ తరఫున మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించడంపై కృతజ్ఞతలు తెలిపారు. సాయంత్రం కోస్గీలో జరిగిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభలో స్వప్న తోపాటు, కౌన్సిలర్ రామకృష్ణ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి ఆమె దశాబ్దాల కాలంగా పార్టీలో కొనసాగుతున్నారు. ఇటీవల పట్నం సునీతారెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అదే బాటలో చైర్‌పర్సన్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు పట్నం కుటుంబం వెంట నడిచేందుకు సిద్ధమయ్యారు. అందులో భాగంగానే చైర్‌పర్సన్ స్వప్న పార్టీ మారారు. చైర్‌పర్సన్‌గా నాలుగేళ్ల పాటు కొనసాగిన ఆమె పార్టీలో వర్గపోరు కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పి.. హస్తం చెంతకు చేరారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

అనంతగిరి: యువతకు చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చీఫ్ లీగల్ డిఫెన్స్ న్యాయవాది వెంకటేష్, డిప్యూటీ డిఫెన్స్ న్యాయవాది రాము సూచించారు, బుధవారం వికారాబాద్ పట్టణంలోని తక్షశిల డిగ్రీ కళాశాలలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీప్పవని హెచ్చరించారు. మూఢనమ్మకాల వల్ల కలిగే ముప్పును ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేయాలని యువతకు సూచించారు. పిల్లలకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ భూమయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు

మెరుగైన వైద్యం అందించాలి



ఆస్పత్రిలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా

- హెల్త్ సెక్రెటరీ క్రిస్టినా చోంగు
- పరిగి ప్రభుత్వ ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ

పరిగి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని హెల్త్ సెక్రెటరీ క్రిస్టినా చోంగు ఆదేశించారు. బుధవారం సీఎం పర్యటనకు వెళ్తున్న క్రమంలో పరిగి ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ అందుతున్న సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రత విషయంలో అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వైద్యులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. విధులను నిర్లక్ష్యం చేసే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆస్పత్రిలో వసతుల కల్పన, సమస్యలపై అవసరమైన ప్రతిపాదనలు పంపిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా పరిగి ఆస్పత్రిని వంద పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ పలువురు ఆమెకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి పల్వాన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

చిన్నారుల లఘు చిత్రాలకు అవార్డులు

బంజారాహిల్స్: ఇంటాక్ట్– ఫిల్మ్ ఇట్ ఇండియా ఫిల్మ్ ఫెస్టివల్‌లో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అద్భుత లఘు చిత్రాలను తెరకెక్కించి వావ్..అనిపించారు. గత పదేళ్లుగా ఫిల్మ్ ఇట్ ప్రోగ్రామ్‌లను పాఠశాల విద్యార్థులు నిరంతరం చేస్తున్నారు. ఏయేటికాయేడు కొత్త ఆలోచనలతో ముందుకువస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది 15 మంది విద్యార్థులు వివిధ సందేశాత్మక అంశాలపై 8–10 లఘు చిత్రాలను రూపొందించి పాఠశాలకు గుర్తింపు తీసుకువచ్చినట్లు పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి తెలిపారు. గ్రేడ్–7 నుంచి శ్రేయాసైన్, సాన్వి ఖండేలియా ఉత్తమ చలనచిత్ర కథనం 'దుర్గపూజ' అవార్డును అందుకున్నారు. అలాగే ఉత్తమ ప్రో–యాక్టివ్ చిత్రం 'గౌతమా' అవార్డును అందుకున్నారు. చల్లగుళ్ల వశిష్ఠ చిత్రం, అలెగ్జాండర్ హెయిర్ సెలూన్, ఉత్తమ కథాంశం అవార్డులను అందుకున్నాయి. ఫిల్మ్ ఇట్ అనేది విద్యార్థులకు సహాయపడే అద్భుతమైన బహుళ–సాంస్కృతిక ప్రాజెక్టుగా ఆమె పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు కాంచనవల్లి అవార్డుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా దర్శకుడు, సినిమాటోగ్రాఫర్, నిర్మాత పింగ్లేరెడ్డి హాజరుకాగా, ఇన్‌టాక్ టీమ్ సభ్యులు అనురాధారెడ్డి, డాక్టర్ ఎస్పీ అంచూరి, అభిషేక్‌దాస్ తదితరులు హాజరయ్యారు.



మహిళా సంఘాలను బలోపేతం చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

- ఐకేపీ సభ్యులకు వడ్డీలేని రుణాలు ఇస్తాం
- సీఎం రేవంత్‌రెడ్డి

బొంరాస్‌పేట: ఐకేపీ మహిళా సంఘాలను బలోపేతం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కోస్గి పట్టణంలో బుధవారం మహిళా సంఘాల సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వికారాబాద్, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన సంఘాల సభ్యులతో సీఎం మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలను మరింత బలోపేతం చేస్తామని, వడ్డీలేని రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఐకేపీ సెంటర్లను మరింత బలోపేతం చేసి, కుటీర పరిశ్రమలను ప్రోత్సహిస్తామని చెప్పారు. సంఘం సభ్యులకు బ్యాంకు లింకేజీ చెక్కుల అందజేశారు. అనంతరం పోలెపల్లికి చెందిన గ్రామ సంఘం నాయకురాలు పద్మమ్మ మాట్లాడారు. నా బిడ్డ నీ వల్లే బతికింది సారు అని భావోద్వేగానికి గురైంది. తమ గ్రామానికి డ్వాక్రా భవనం మంజూరు చేయాలని కోరారు. అందుకు సీఎం సానుకూలంగా స్పందించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ అమ్మమ్మ ఊరు పోలేపల్లే అని సీఎం వివరించారు. ఏం సర్పంచమ్మా.. బాగున్నవా?' అంటూ కొడంగల్ మండలం అంగడిరాయిచూర్ మాజీ సర్పంచ్ మల్లీశ్వరీని సీఎం ఆప్యాయంగా పలకరించారు. అనంతరం జోగిని వ్యవస్థ నిర్మూలన పోరాట సమితి నాయకురాలు హాజమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతికుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, ఇరు జిల్లాల కలెక్టర్లు సి.నారాయణరెడ్డి, కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.

సీఎంకు మరో ఓటమి చురక తప్పదు

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

అనంతగిరి: రాబోయే అరవై రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డికి మరో ఓటమి చురక తప్పదని బీజేపీ మహబూబ్‌నగర్, చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్, కామారెడ్డి ఎమ్మెల్యే, వెంకటరమణారెడ్డి జోస్యం చెప్పారు. బుధవారం అనంతగిరి గుట్టలోని హరిత రిసార్ట్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్ చేవెళ్ల, మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాలను ఇన్‌చార్జ్‌గా తీసుకున్నారని, ఈ రెండు స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇది వరకే కామారెడ్డిలో ఓటమి పాలయ్యారని గుర్తు చేశారు. ప్రధాని మోదీ పాలనలో దేశం అగ్రగామిగా నిలిచిందన్నారు. ఈ దేశాన్ని నడిపే సత్తా మోదీకే ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థి లేక పక్క పార్టీ నుంచి అరువు తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా చేవెళ్లలో బీజేపీ అభ్యర్థి ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎలాంటి వ్యక్తో ఈ ప్రాంత ప్రజలందరికీ తెలుసన్నారు. ఆయనకు ప్రజల అండదండలు ఉన్నాయని పేర్కొన్నారు.

మరోసారి మోదీని కోరుకుంటున్నారు

మోదీని మరోసారి ప్రధానిగా చూడాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ అన్నారు. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక రూపంలో మోదీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాలను తాము కైవశం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. రాజరాజేశ్వర బస్సు యాత్రకు మంచి స్పందన వస్తోందన్నారు. సర్వేలన్నీ బీజేపీకి అనుకూలంగా వస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో పది ఎంపీ స్థానాలను గెలిచి తీరుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మాజీ అధ్యక్షుడు సదానందరెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ మల్లారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ మైపాల్‌రెడ్డి, పార్లమెంట్ ప్రభారి విష్ణువర్ధన్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ నందకుమార్ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు శివరాజు, పాండు గౌడ్, కేపీ రాజు, కౌన్సిలర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



ట్రాక్టర్‌ను సీజ్ చేసిన పోలీసులు

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పోలీసులు సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి బొంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దండు వెంకటేశ్.. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంలో ఆ ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని, ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అన్వేష్ రెడ్డి మాట్లాడారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇండియా ట్రాన్స్ కృషి అభినందనీయం



జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ వెంగమ్మ

మొయినాబాద్ రూరల్: న్యూరో సైన్స్‌లో పురోగతి కోసం ఇండియా ట్రాన్స్ చేస్తున్న కృషి అభినందనీయమని కేఎల్ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ చైర్మన్ కోనేరు సత్యనారాయణ అన్నారు. న్యూరో సైన్స్‌లో పురోగతి అంశంపై అజీజ్‌నగర్ సమీపంలోని యూనివర్సిటీ కళాశాలలో బుధవారం ఇండియా, ఫ్రాన్స్ సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక ఆరోగ్య సవాళ్లను సమర్థవంతంగా పరిష్కరించేందుకు సంప్రదాయ పద్ధతులను అవలంబించాలన్నారు. ఫ్రాన్స్‌లోని తోర్బిన్ విశ్వవిద్యాలయం, పారిస్ బ్రెయిన్ ఇనిస్టిట్యూట్ గ్రూప్ అధికారులు ప్రొఫెసర్ డేనియల్ రాకోసియా, బయోమెడికల్ రీసెర్చ్ డాక్టర్ అలెగ్జాండర్ తదితరులు మాట్లాడుతూ.. న్యూరో సైన్స్ పురోగతిపై వివిధ దేశాల్లో కొనసాగుతున్న అన్వేషణలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్యానెల్ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వెంగమ్మ, నిపుణులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లఘించిన నలుగురికి జైలు

శంషాబాద్: శంషాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 17 మందిని ట్రాఫిక్ పోలీసులు బుధవారం రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరు పర్చారు. వీరిలో నలుగురు వ్యక్తులకు న్యాయమూర్తి జైలుశిక్ష, జరిమానా విధించగా.. మిగతా వారికి జరిమానా విధించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ సీఐ రాజు సూచించారు.

యువతిని వేధించిన కేసులో జైలు

శంకర్‌పల్లి: ఓ యువతిని వేధించిన కేసులో నిందితునికి చేవెళ్ల కోర్టు 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్పల్లికి చెందిన గుండాల శ్రీరాంరెడ్డి(25), ఓ అమ్మాయిని వేధించడంతో ఆమె శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. 5సంవత్సరాలుగా కోర్టులో కేసుపై వాదనలు జరిగాయి. పోలీసులు కోర్టులో సాక్ష్యాధారాలు సమర్పించడంతో బుధవారం న్యాయమూర్తి నిందితుడికి జైలు శిక్ష వేస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో సహకరించిన ఎస్ఐ లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను డీసీపీ, ఏసీపీ అభినందించారు.

హామీలన్నీ నెరవేరుస్తాం



పరిగి: కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ఎవరికి ఏ సాయం కావాలన్నా.. క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోండి
- ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా, అర్హులందరికీ అందజేస్తామని చెప్పారు. ఎవరికి ఎలాంటి సాయం కావాలన్నా.. క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటామని, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, తహసీల్దార్ ఆనంద్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, కౌన్సిలర్లు శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖజానాను ఖాళీ చేసిన బీఆర్ఎస్

కుల్కచర్ల: పేద అభ్యున్నతికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేసి మాట్లాడారు. గత ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసి, ఉద్యోగులకు జీతాలు ఇవ్వని పరిస్థితికి తెచ్చిందని ఆరోపించారు. ఆ కారణంగానే ప్రస్తుత సంక్షేమ పథకాల అమలు ఆలస్యం జరుగుతుందని పేర్కొన్నారు. ఉద్యోగులందరికీ సరైన సమయానికి జీతాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జెడ్పీటీసీ రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. 160 కల్యాణలక్ష్మి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ నిధులు త్వరగా అందేలా చూడాలని కోరారు. అదే విధంగా ఎన్నికల్లో ఇచ్చినహామీని అనుసరించి ప్రస్తుత నగదుతో పాటు తులం బంగారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీఓ రామకృష్ణ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పరిగి బ్లాక్ ఏ అధ్యక్షుడు పంతులు, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, ఎస్టీసెల్ అధ్యక్షుడు రాంచందర్, బీసీసెల్ అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షులు హరినాథ్ రెడ్డి, కృష్ణయ్య, యువజన విభాగం అధ్యక్షుడు జంగయ్య, నాయకులు జోగు వెంకటయ్య, పెంటమీది వెంకటయ్య, గోవర్ధన్ రెడ్డి, శ్రీశైలం, భాస్కర్, బాలకృష్ణ, పులింగ చిన్న వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసరమైతేనే సిజేరియన్

- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు
- డీఎంహెచ్ఓ డాక్టర్ పల్వన్ కుమార్



పట్టణంలోని ఆసుపత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ

తాండూరు టౌన్: గర్భిణుల స్కానింగ్ వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పల్వన్ కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన పట్టణంలోని శెట్టి అపెక్స్ హాస్పిటల్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్వన్ మాట్లాడారు. ఆసుపత్రుల్లో జరిగే ప్రసవాలను ఈ-బర్త్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అలాగే గర్భవతులకు నిర్వహించిన స్కానింగ్ వివరాలను కూడా నమోదు చేయాలని, అత్యవసరమైతేనే సిజేరియన్ చేయాలని పేర్కొన్నారు. అనుమతి లేకుండా అబార్షన్లు చేయరాదని హెచ్చరించారు. ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు అన్ని రకాల వైద్య సౌకర్యాలను తప్పకుండా నమోదు చేసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగితే.. చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సోదాల్లో డీఎంహెచ్ఓతో పాటు డాక్టర్ సాయిబాబా, ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్, జిల్లా మాస్ మీడియా అధికారి వి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

పరస్పరం కత్తులతో దాయాదుల దాడులు

పార్కింగ్ విషయంలో తలెత్తిన ఘర్షణ

మొయినాబాద్: కారు పార్కింగ్ విషయంలో దాయాదుల మధ్య తలెత్తిన వివాదం కత్తుల దాడికి దారి తీసింది. ఈ సంఘటన మండల పరిధి సురంగల్‌లో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సురంగల్ గ్రామానికి చెందిన సోమ జ్ఞానేశ్వర్, సోమ వెంకటేశ్, సోమ కుమార్ దాయాదులు. వీరి ఇళ్ల ముందు సుమారు వంద గజాల ఖాళీ స్థలం ఉంది. అందులో కార్లు పార్కు చేస్తున్నారు. జ్ఞానేశ్వర్ తన కారును వెంకటేశ్ ఇంటి ముందు పార్కు చేస్తున్నాడు. ఈ విషయమై నెల రోజుల క్రితమే గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. ఎవరి ఇంటి ముందు వారి కారు పార్కు చేసుకోవాలని గ్రామ పెద్దలు చెప్పారు. కానీ జ్ఞానేశ్వర్ ఆ మాటలు విస్మరించి ఇంటి ముందు కారు నిలపడంతోపాటు మద్యం తాగి కత్తి, కారంపొడి తీసుకుని దూషిస్తూ వెంకటేశ్, కుమార్‌పై దాడికి దిగాడు. వారు సైతం ఎదురు దాడికి దిగడంతో రణరంగాన్ని తలపించింది. ఈ ఘటనలో జ్ఞానేశ్వర్ తల, చేతులకు గాయాలయ్యాయి. వెంకటేశ్, అతడి కుమారుని తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుమార్‌కు స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు 100 డయల్ చేయడంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని దాడులను అడ్డుకున్నారు. గాయాలైనవారిని ఆస్పత్రికి తరలించారు.

అంకితభావంతో పనిచేస్తేనే.. సంతృప్తి

అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



డీపీఆర్ఓను సన్మానిస్తున్న కలెక్టరేట్ ఉద్యోగులు, పాత్రికేయులు

వికారాబాద్ అర్బన్: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసినప్పుడే సంతృప్తి కలుగుతుందని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్లో గద్వాల జిల్లాకు బదిలీపై వెళ్లిన జిల్లా పౌర సంబంధాల అధికారి మహ్మద్ ఆరీఫుద్దీన్‌కు విలేకరులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో అధికారులు, పాత్రికేయులతో సమన్వయం చేసుకుంటూ.. సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో డీపీఆర్ఓ ఆరీఫుద్దీన్ కృషి ఎంతో అభినందనీయమని చెప్పారు. డీపీఆర్ఓ.. సౌమ్యుడిగా ఉంటూ, అందరిని కలుపుకొని పనిచేశారని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి అమరేందర్ కృష్ణ, సహాయ పౌర సంబంధాల అధికారి ప్రభాకర్, కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, సతీష్ కుమార్, నాగలక్ష్మి, దస్తమ్మ, జిల్లా పాత్రికేయులు పాల్గొన్నారు.

అడవిలో దొంగలు పడ్డారు



సంగాయపల్లి అడవిలో దొంగలు నరికివేసిన చెట్లు

- విచక్షణారహితంగా చెట్ల నరికివేత
- పరిశీలించిన డీఎఫ్ఓ వెంకటేశ్వర్లు
- అయినా ఆగని అక్రమార్కుల ఆగడాలు

ధారూరు: ధారూరు ఫారెస్ట్ రేంజ్ అడవిలో దొంగలు పడ్డారు. ఇష్టంగా ఎకరాల కొద్ది అరణ్యంలో చెట్లను నరుకుతూ, అడవిని లూటీ చేస్తున్నారు. అధికారులు పర్యవేక్షించినా, చర్యలు తీసుకున్నా.. దుంగల దొంగల ఆగడాలకు అడ్డుకట్ట పడటంలేదు. వివరాలు ఇలా ఉన్నాయి. అడవిలో అక్రమార్కులు నరికివేసిన చెట్లను మంగళవారం ఫారెస్టు ఫ్లైయింగ్ స్క్వాడ్ (డిస్ట్రిక్ట్ ఫారెస్టు ఆఫీసర్)డీఎఫ్ఓ వెంకటేశ్వర్లు పరిశీలించారు. అనంతరం విచారణ జరిపి వెళ్లారు. అలా వెళ్లిన రాత్రే దుంగల దొంగలు.. అడవిలో భారీగా చెట్లను నరికి వేశారు. ఆ దుంగలను కుప్పలుగా నిల్వచేశారు. ఈ సంఘటన ధారూరు ఫారెస్టు రేంజ్ పరిధి సంగాయపల్లి ఫారెస్టు బీట్‌లో బుధవారం వెలుగు చూసింది. సంగాయపల్లి ఫారెస్టు బీట్‌లో పక్షం రోజులుగా అడవిలో చెట్లను నరికివేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

దొంగలకు కాపలానా?

అడవుల నరికివేత సమాచారం మేరకు, డీఎఫ్ఓ వెంకటేశ్వర్లు సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో ఫారెస్టు రేంజ్‌లోని సంగాయపల్లి బీట్‌లో చెట్లను నరికివేసి, దగ్ధం చేసినట్లు గుర్తించారు. కాగా.. డీఎఫ్ఓ వెంట వచ్చిన రేంజ్ అధికారులు.. నరికిన దాంట్లో కొంత భాగాన్నే చూపించి, అధికారిని తప్పుదోవ పట్టించినట్లు సమాచారం.పై అధికారికి వాస్తవాన్ని చూపకుండా.. కింది స్థాయి అధికారులు జాగ్రత్త పడ్డారని, అడవిని రక్షించాల్సిన వారే.. దుంగల దొంగలకు కాపాలా కాస్తున్నారని పరిసరప్రాంత ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు. రాస్నం ఫారెస్టు సెక్షన్ పరిధిలో అటవీ భూభాగం ఆక్రమణకు గురవుతున్నా.. ఎవరూ పట్టించుకోవటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. అడవులను నరికి, కబ్జాలకు పాల్పడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేదంటే అడవి కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తగిన చొరవ తీసుకుని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

- ఏబీవీపీ, విద్యార్థి సంఘాల డిమాండ్
- విద్యార్థులను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయంటూ మండిపాటు

అనంతగిరి: ప్రభుత్వం వెంటనే ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌ను విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం హరీశ్ మాట్లాడారు. గత ప్రభుత్వం విద్యార్థులకు వ్యతిరేకంగా నడుచుకుందని, ఈ ప్రభుత్వమైనా వారి పక్షాన ఉంటుందంటే.. విద్యార్థి వ్యతిరేక విధానాలతో ముందుకు వెళ్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడు నెలలు గడుస్తున్నా.. ఇంతవరకు విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌ను విడుదల చేయలేదని, దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం బకాయిలను చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు.. సంబంధిత ధ్రువపత్రాలను ఇవ్వడం లేదని, ఇది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేయనుందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయి గణేశ్, పట్టణ జాయింట్ సెక్రెటరీ జగదీశ్ చారీ, అనిల్, ఆదికేశవ, మంజునాథరెడ్డి, మురళీ, కార్తీక్, శ్రీధర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మూగ యువతిపై అత్యాచారం.. పీఎస్‌లో ఫిర్యాదు

తాండూరు రూరల్: ఓ మూగ యువతిపై అత్యాచారం జరిగిన సంఘటన కరన్‌కోట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. తాండూరు పట్టణ సమీపంలోని ఓ గ్రామానికి చెందిన యువతి (20)కి పుట్టు మూగతో పాటు మతిస్థిమితం సరిగా లేదు. ఇదే గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో యువతి గర్భం దాల్చింది. ఈ విషయం తెలియడంతో ప్రజా సంఘాలు, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. యువతి తండ్రి కరన్‌కోట్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి నగరంలో ఉన్నట్లు సమాచారం.

ఈపాస్ ద్వారా విక్రయించాలి



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న గీతారెడ్డి, ఏఓ తులసీ

- జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి
- చేవెళ్లలో పలు ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

చేవెళ్ల: రైతులకు అమ్మే ఎరువులను డీల్లరు ఈపాస్ యంత్రాల ద్వారా విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను బుధవారం స్థానిక వ్యవసాయాధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని సాయినాథ్, రాఘవేంద్ర, శ్రీరామ, గణేశ్ దుకాణాలతోపాటు ఎన్కేపల్లి చౌరస్తాలోని రాఘవేంద్ర, వెంకటేశ్వర దుకాణాలను తనిఖీలు చేశారు. ఆయా దుకాణాలలో ఉన్న స్టాక్ వివరాలను ఆమె పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయా దుకాణాలలో ఉన్న ఈపాస్ యంత్రాలను పరిశీలించారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ప్రతి డీలర్ వద్ద ఈపాస్ యంత్రాలు ఉండాల్సిందేనని చెప్పారు. ఎరువులకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో ఎరువుల వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. రైతులకు అందుబాటులో ఎరువులు ఉండేలా డీలర్లు చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట చేవెళ్ల మండల వ్యవసాయాధికారి తులసీ, ఆయా దుకాణాల డీలర్లు ఉన్నారు.

మాతృభాషా ఔన్నత్యాన్ని చాటి చెప్పాలి

మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు

సనత్‌నగర్: మాతృభాష ఔన్నత్యాన్ని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు అన్నారు. అక్షయాన్ తెలుగు విమెన్ రైటర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రముఖ కవి అందెశ్రీకి పంపకవి పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ ప్రపంచంలో 40 శాతం మంది తమ మాతృభాషలో చదవలేకపోతున్నారన్నారు. ఫిబ్రవరి 21న ప్రపంచ వ్యాప్తంగా మాతృభాషా దినోత్సవం జరుపుకుంటున్నామని, కేవలం వేడుకలకే పరిమితం కాకుండా తెలుగు భాష గొప్పతనాన్ని నేటి యువతకు చేరేలా కవులు, రచయితలు తమ కలాలకు పదునుపెట్టాలన్నారు. లిపిలో కొరియా భాష తర్వాత తెలుగు భాషకు అంత ప్రాధాన్యం ఉందన్నారు. తెలుగు భాషకు అద్భుతమైన వ్యాకరణం ఉందన్నారు. స్వర్గీయ పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలో స్పానిష్ దేశానికి చెందిన వారు ఇంటర్వ్యూ చేసేందుకు రాగా వారితో పీవీ ఆంగ్లంలో మాట్లాడగా వారికి ఇంగ్లిష్ రాకపోవడంతో స్పానిష్‌లో ప్రశ్నలు అడిగారన్నారు. పీవీ సైతం స్పానిష్ భాషలో సమాధానాలు చెప్పడంతో వారు పీవీ బహుభాషా పాండిత్యాన్ని కొనియాడారని గుర్తుచేశారు.

అందరిదీ తెలంగాణ: పురస్కార గ్రహీత అందెశ్రీ..

''ఒక్కడు లెక్కలేసుకుంటే తెలంగాణ వచ్చింది కాదని.. పురుడు పోసుకున్న పసికూనల నుంచి కాటికి కాలుసాచే వారు పోరాడితే వచ్చిందే తెలంగాణ..అందరిదీ తెలంగాణ.. ఐదేళ్లు కాకపోతే పదేళ్లు ఏలుకోండి..ఎల్లకాలం ఏలడానికి ఎవరి తాత జాగీరు కాదు'' అంటూ పంపకవి పురస్కార గ్రహీత అందెశ్రీ అన్నారు. తనకు తన భాష తప్ప మరో భాష రాదన్నారు.

ఎమ్మెల్యేగా వెళ్లి.. సీఎంగా వచ్చారు



ఏకరూప వస్త్రధారణలో మహిళాలోకం



వేదికపై అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యే



సభకు వచ్చిన శివస్వాములు



సమావేశంలో కార్యకర్తల జోష్

బొంరాస్‌పేట: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి 60 రోజుల క్రితం కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా వెళ్లి, సీఎంగా అధిష్ఠించి తొలిసారి సొంతగడ్డకు రావడం ప్రజల్లో ఆనందం నింపింది. వేల కోట్ల నిధుల పనులు మరింత గర్వాన్ని పెంచింది. అందుకు సంబంధించిన కార్యక్రమాలు, హైలెట్స్ ఇవీ..

- ▲ సాయంత్రం 5గంటలకు కోస్గి పట్టణానికి సీఎం హెలికాప్టర్ చేరుకుంది.
- ▲ 6.20గంటలకు తిరిగి వెళ్లింది.
- ▲ సీఎం రేవంత్ సాయంత్రం 6.36ని.లకు బహిరంగసభ వేదిక వెళ్లి, 25ని.ల పాటు ప్రసంగించారు. అనంతరం కారు కాన్వాయితో కొడంగల్, పరిగి మీదుగా రాత్రి 8.25ని.లకు హైదరాబాద్ బయలు దేరారు.
- ▲ చుట్టుపక్కల మండలాలు, జిల్లాలకు చెందిన పార్టీ నేతలు బహిరంగ సభా వేదికపై ప్రసంగించి ఆనందం పొందారు.
- ▲ మంత్రులు ఉత్తం, కోమటిరెడ్డి ప్రసంగాల్లో సీఎం పట్ల అభినందనలు ఆకట్టుకున్నాయి.
- ▲ కోస్గి పార్టీ నేత వార్ల విజయ్‌కుమార్ పోలీసుల పట్ల చేసిన వ్యాఖ్యలు కొంత అసంతృప్తిని కలిగించాయి.

విద్యుత్ సమస్యను పరిష్కరిస్తాం

మణికొండ: విద్యుత్ వినియోగదారులకు సరఫరా సమస్యలతో పాటు శాఖాపరమైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని మణికొండ ఏఈ జ్ఞానేశ్వర్ కోరారు. బుధవారం ఆయన పుప్పాల్‌గూడలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ.. రాబోయే వేసవికాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఇప్పటికే పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. విద్యుత్ వినియోగం పెరగటం, ఇతర సమస్యల వలన సరఫరా నిలిచిపోతే వెంటనే తమ ఫ్యూజ్ కాల్ కార్యాలయం ఫోన్ నెంబర్ 9493193119, ఏఈ మణికొండ 0440813097, ఏడీఈ ఇబ్రహీంబాగ్ 9440813060, డీఈ ఇబ్రహింబాగ్ 8901093677, ఎస్ఈ సైబర్‌సిటీ 9440813046 నెంబర్లకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. తమతో పాటు సిబ్బంది, ఉన్నతాధికారులు సకాలంలో స్పందించి అక్కడ ఎదురైన సమస్యను పరిష్కరిస్తామని వారు పేర్కొన్నారు.

కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్య

శంకర్‌పల్లి: కడుపు నొప్పి భరించలేక ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలోని మహారాజ్‌పేట్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాజ్‌పేట్ గ్రామానికి చెందిన ఎం. రాములు(42) నాలుగు నెలలుగా కడుపునొప్పితో బాధ పడుతున్నాడని తెలిపారు. ఆ నొప్పి భరించలేక బుధవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడికి భార్య శ్రీలత, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.